# డాక్టర్ రచయిత

**(ఏప్రిల్, 1987 ఆంధ్రభూమి మాస పత్రిక)**

"సిస్టర్" పిలిచాడు డాక్టర్ తన్మయరావు,

"ఎస్ డాక్టర్.." పలికింది సిస్టర్ విశాలం.

"వొచ్చారా పేషెంట్లెవరయినా?

"ఒకతను వొచ్చి కూచున్నాడు డాక్టర్..."

"ఒకతను వొచ్చాడని అంత విసుగ్గా, అంతనీరసంగా చెప్తావేమిటి సిస్టర్ ... పంపిన ఏ ఒక్క కథా ఏ పత్రికలోనూ అచ్చువకుండా వెనక్కి తిరిగొచ్చేసే కాబోయే రచయితకి, పారితోషికం పైసా అన్నా ఇవ్వకుండా, ఓ కథవేసుకున్నందుకు అదే పదివేలని సంతోషిస్తాడా సంతోషించడా?... ఆ సంతోషం కూడా అలాంటి, ఇలాంటి సంతోషమా? ఎలా ఉంటుంది? మబ్బుల్ని, చూసి ఉప్పొంగే మయూరిలా, చంద్రుడిని చూసి పొంగిపోయే కలువకన్నెలా, కన్నతల్లిని కావలించుకున్న బిడ్డలా... అబ్బా! నా కవిత్వానికి, నా భావావేశానికి నేనే ఆనకట్ట వేసుకోవలసి రావడం ఎంత బాధగా ఉంటుందో?... నా ఇంట్లో వాళ్ళే నన్ను ఆటలో అరిటి పండులా తీసిపడేసి, పక్కవీధిలో డాక్టర్ దగ్గరికి వెళ్తుంటే కూడా ఇంత బాధ అనుభవించలేదు నేను... పోన్లే ప్రతి మనిషి జీవితమూ ఓ కథలాంటిదే... కథ అన్నాక కష్టాలూ ఉండచ్చు, మలుపులూ ఉండవచ్చు. సరే ... గాలికి ఊగే లేత సన్నజాజి రెమ్మలా కదిలివెళ్ళి, కళ్ళల్లో కరుణ చిందిస్తూ, మొహంలో శాంతాన్ని ప్రదర్శిస్తూ లేని చిరునవ్వుని పెదాలకి అంటించుకుని, ఈనాటి మన పాలిటి ఆ ఒక్కగానొక్క మహారోగిని లోపలికి తీసుకురా."

సన్నజాజి రెమ్మలా కాకపోతేపోయె, కనీసం క్రోటన్స్ కొమ్మలా కూడా కాకుండా, చింతమానులా నడుచుకుంటూ బయట వరండాలోకి వెళ్ళి, అక్కడున్న వ్యక్తిని డాక్టర్ గారు పిలుస్తున్నారు లోపలికి రమ్మంది.

తను రాస్తున్న కథ కాగితాల్లోకి చూస్తున్నాడు డాక్టర్.

"నమస్కారం డాక్టర్ బాబూ!" లోపలికి అడుగు పెడుతూ రెండు చేతులూ జోడించాడు. అతని పేరు అయోమయం.

"ఆహా... నేను రాస్తున్న ఈ కథలోని హీరోవాయిస్ ఎంత గంభీరంగా ఉంటుందో మూడు పేజీల్లో వర్ణించాను... కానీ, ఇలా కాగితాల్లోంచి నా హీరో నన్నే గొంతెత్తి పిలుస్తాడని కలగన్నానా?"

తలెత్తి చూడకుండా తన్మయంలో ఉన్నాడు డాక్టర్.

తన వంక చూడనైనా చూడకుండా ఏదేదో మాట్లాడుతున్న డాక్టర్ని, పక్కన నిలబడ్డ సిస్టర్ని మార్చి మార్చి చూశాడు అయోమయం, అసలు సంగతేమిటో అంతుపట్టక.

ఇప్పుడు గులకరాళ్ళ డబ్బా దొర్లించినట్టు మాట్లాడింది మీ కథలో హీరో కాదు స్వామీ! ఈ పేపర్లల్లోంచి కాసేపు తలెత్తితే పైసలేమన్నా వొస్తాయి. లేకపోతే వొచ్చిన ఈ ఒక్క పేషెంటూ పత్తాలేకుండా పారిపోతాడు... మనసులోనే విసుక్కుంది సిస్టర్.

పైకి మాత్రం "మీ కథలో హీరోని కాసేపు పక్కకి పెట్టి, నేటి మన పేషెంటు హీరోని పరీక్ష చెయ్యండి ముందు" అంది నవ్వుతూ. గబ్బుక్కుని తలెత్తాడు డాక్టర్.

ఎదురుగా, సన్నగా, పొడుగ్గా, చామన చాయలో, మర్యాద ఉట్టి పడే మొహంతో ఓ యువకుడు.

డాక్టర్ కళ్ళు తళుక్కువ మెరిశాయి.

"సిస్టర్..."

"ఎస్. డాక్టర్..."

"నేను రాసిన దెబ్బకి దెయ్యం వొదిలింది కథలో హీరోలాలేదూ ఇతను...?

"ఆ... దెయ్యవా? అయ్యబాబోయ్... ఓర్నాయనోయ్... ఎక్కడా? ఎక్కడా?" భయంతో గుండెలు బాదుకుంటూ, డాక్టర్ గారి బల్ల చుట్టూ పరుగులు మొదలెట్టాడు అయోమయం. అతన్ని పట్టుకుని ఆ పేందుకు, అతని వెనక పడుతూ, లేస్తూ తను పరిగెత్తడం మొదలెట్టింది సిస్టర్.

ఆ దృశ్యం చూస్తుంటే, తను రాస్తున్న కథకి టైటిల్ తట్టింది డాక్టర్ కి... ఎక్కడ మర్చిపోతానో అని, సొరుగులోంచి డైరీ తీసి అందులో నోట్ చేసుకున్నాడు. "పరుగో పరుగు"

ఛ...ఛ... ఈ పేరుతో ఆల్ రెడీ ఒక సీరియల్ వొస్తున్నట్టుంది. కథలు కాపీ కొడితే పర్వాలేదు గానీ, మరీ టైటిల్స్ కూడా కాపీ కొడితే బాగోదు.. "అందని పరుగు" అంటే సరి... ఆ... ఇది బావుంది" పరుగో పరుగు అన్నది కొట్టేసి పక్కన "అందని పరుగు" అని రాశాడు.

పరిగెత్తి, పరిగెత్తి అలిసిపోయిన అయోమయం, సిస్టర్ ఇద్దరూ కూడా ఆయాసాల్తో రొప్పుతూ, ఆకలిగొన్న పులుల్లా ఎగిసిపడుతున్నారు. తమకి తెలియ కుండానే, డాక్టర్ గారికి ఒకళ్ళు ఈ పక్కా, ఒకళ్ళు ఆ పక్కా కుర్చీకి తగుల్తూ నిలబడ్డారు. "డాక్టర్.. హూ... హూ..." ఆయాసపడిపోతూ ఏం చెప్పదల్చుకుందో చెప్పలేకపోతోంది సిస్టర్.

"డాక్టర్ బాబూ.... డాక్టర్ బాబూ.. హూ... హూ..." అంతకంటే ఘోరంగా ఆయాసపడిపోతూ మాట పూర్తిచెయ్య లేకపోతున్నాడు అయోమయం.

వాళ్ళిద్దరి ఆయాసాలూ చూస్తూ బల్లమీద మూత పెట్టి ఉన్న గ్లాసుడు మంచినీళ్ళూ గడగడా తాగేశాడు డాక్టర్ గ్లాసు బల్లమీద పెట్టబొతూ అన్నాడు "నీకు దెయ్యాల పేరు చెప్తే భయం వేస్తుందేవిటోయ్?" సరిగ్గా అప్పుడే బయట రోడ్డుమీద పోతున్న లారీ హారన్ భొయ్యిమంది.

"వాయ్ నాయనోయ్! దెయ్యవా? దెయ్యాల కొట్టోకి వొచ్చి పడ్డానా?" ఏడుపు గొంతుతో కేక పెడుతూ, అమాంతం డాక్టర్ని వాటేసుకున్నాడు అయోమయం.

ఆ ఊపుకి డాక్టర్ చేతిలోంచి గ్లాసు కింద పడి భళ్ళు మంటూ బుజ్జి బుజ్జి ముక్కలయింది.

మోసపోయాను మోసపోయాను." నుదురు కొట్టు కుంటూ, కళ్ళు మూసి, వెనక్కి వాలాడు కుర్చీలో డాక్టర్.

డాక్టర్ గారి కేదో అయిపోయిందని భయపడ్డారు ఆయాసపడటం ఆ పేసిన సిస్టరూ, అరుపులకి ఫుల్‌స్టాప్ పెట్టిన అయోమయం.

"అయ్యో! డాక్టర్! మీ కేమైంది?" రేపు ఒకటవ తేది కూడాను. నెలజీతం కళ్ళచూద్దామను కుంటుంటే ఇంతలో ఏమైంది ఈ డాక్టర్‌కి. సిస్టర్ గుండెల్లో రాయి పడింది.

"డాక్టర్ బాబూ... డాక్టర్ బాబూ" డాక్టర్ ముక్కు ముందర చెయ్యి అడించి "ఊపిరి ఉన్నట్టే ఉంది అయినా, ఎందుకైనా మంచిది. ఓ ఇంజక్షన్ ఏదన్నా పొడునర్సమ్మా.." సలహా పారేశాడు అయోమయం తనకి తోచినంతలో

"సడేలే సంబడం బోర్డు కట్టి దుకాణం తెరిచాక, ఇంతవరకూ ఒక్కడికన్నా ఇంజక్షన్ ఇచ్చుకుని ఈ డాక్టర్ బాబే తరించలేదు.. అలాంటిది... ఇప్పుడు... ఈ డాక్టర్ బాబు కింద పనిచేసే నర్సమ్మని... నేను... ఆయన గారినే పొడిచెయ్యనా?..."

"మరేం చేద్దావనీ? పోనీ... ఆ సూది ఎలా కసిక్కిన దింపాలో నాకైనా చెప్తే నేను దింపేస్తాను డాక్టర్ బాబు చేతిలో... తోట పనిచేసేవాడిని.. గునపంతో తవ్వడం రోజూ నాకలవాటే..." కోపంగా గుడ్లురిమి చూస్తోంది సిస్టర్ విశాలం.

కళ్ళు తెరిచాడు డాక్టర్.

ఎలాగో ఉంది ఆ చూపు.

భయం వేసింది అయోమయానికి.

ఒకడుగు వెనక్కి వేశాడు. గాజు ముక్క మీద పడింది కాలు.

"వాయ్ నాయనోయ్! అయిపోయింది నా పని"

"కాదు నీ పనికాదు, నా పనే అయిపోయింది. నేనే మోసపోయాను. నా కథలో హీరో గొంతులా ఉంది నీ గొంతని మురిసిపోయాను. నా హీరోలా ధైర్యవంతుడివి కూడా అయి ఉంటావని సంబరపడ్డాను.. కానీ, మోసపోయాను... నువ్వు చూస్తే ఉత్త పిరికివాడివిలా ఉన్నావు" గొంతులో సుళ్ళు తిరుగుతున్న ఆవేదనతో అసలు సిసలు రచయితలా, ఆవేశం అణుచుకుంటూ ఆక్రోశిస్తున్న హృదయాన్ని అదిమి పెడుతూ వాపోయాడు డాక్టర్.

"అబ్బా! రక్తం... అయ్యో రక్తం... నాకాలి నించి రక్తం కారుతోంది. నా రక్తవంతానీ ఆస్పత్రికి ధారపొయ్యాల్సొచ్చిందిరో దేవుడా!..." కాలుపట్టుకుని కింద చతికిలపడ్డాడు అయోమయం.

"సిస్టర్... ఇతని కాలికి గాయం అయింది. నెత్తురొస్తోంది. ఎవరైనా డాక్టర్ దగ్గరికి తీసికెళ్ళడం మంచిది".

"మహాప్రభో.... మీరు డాక్టర్ కదా?" గుర్తు చేస్తూ గయ్యిమంది.

"ఓ... సారీ... నా ఆలోచనలన్నీ నేనా మధ్య రాసిన "రక్తం రక్తం" అన్న కథ మీదకి వెళ్ళిపోయాయి. ఇతన్ని లేవదీసి బల్లమీద పడుకోపెట్టు. కాలికి మందురాసి కట్టుకట్టు..."

"రావయ్యా... ఈ బల్లమీద పడుకో"

"అయ్‌బాబోయ్... నే పడుకోను బల్లమీద. ఆపరేషన్ చేసి నపుడేగా బల్లమీద పడుకోపెడతారు. నా కాలుకోసేస్తావా ఏం?"

"కాలూ కొయ్యం, కీలూ విరవం... ఎక్కవయ్యా బాబూ. డాక్టర్‌కి తగ్గ పేషెంటువి దొరికావు" చివరి మాటలు అట్టే గట్టిగా అన్లేదు. సగం రాస్తూ వొదిలేసిన కథ కాగితాలు అందుకున్నాడు డాక్టర్.

"నర్సమ్మా...అంతరక్తం చూస్తుంటే నీకు భయం వెయ్యట్లేదా? సొనకారుతున్న అరిటికాయని తుడిచిపారేసినట్లు తేలిగ్గా తుడిచేస్తున్నావు..." అయోమయం సందేహం.

"అట్టే విసిగించావంటే నీ ప్రశ్నలతో, ఈ బ్యాండేజి నీ నోటికి వేసెయ్యగలను జాగర్త".

"సిస్టర్... ఆఫ్ హ్యూమాన్ బ్యాండేజి అన్న నవల చదివావా?"

"నవలలు చదవడం ఒక్కటే తక్కువ నా మొహానికి, ఇంట్లో కాస్తయినా టైము దొరికితే పడి నిద్దరవుదామనుంటుంది"

"ఇంటి కెళ్ళిందగ్గర్నించి ఇంట్లో చాకిరీ కాబోలు పాపం.. నా రాబోయే నవల్లో నీలాంటి నర్సునే హీరోయిన్‌గా పెడతాను."

"నిజంగానా డాక్టర్"? మొహం చింకి చేటంత చేసుకుని, కళ్ళు పెద్దవిచేసి, పట్టలేని ఆనందంతో కాలికి కడుతూ కడుతూ ఉన్న కట్టు సగంలో వొదిలేసి, డాక్టర్ దగ్గరి కొచ్చింది.

"నిజం... ఇదిగో... ఆ రాస్తూ రాస్తూన్న కథమీద ఒట్టు"

"ఛ... మీ కథ మీద ఒట్టేస్తే నాకు నమ్మకం ఉండదు..."

"మరి దేని మీద వెయ్యనూ?"

"మీర్రాసేవి చాలా మటుకు ఆ చెత్తబుట్టపాలేగా... ఆ బుట్ట మీద వెయ్యండి ఒట్టు".

"సరే అలాగే అనుకో"

"అమ్మోవ్ నాకాలు... అయ్యోవ్ నాకాలు..." అయోమయం అరుపులు బల్లమీంచి.

"అచ్చం... నేను రాసిన" "బండ కృష్ణయ్య" కథలో క్రిష్ణయ్యలా అరుస్తున్నాడు కదూ అతను?" ముచ్చటపడిపోతూ, తన కథలో కృష్ణయ్యే లేచొచ్చినట్టు అయోమయం వంక చూశాడు డాక్టర్.

"గాజు ముక్క దీవంత గుచ్చు కుందో లేదో గావుకేక లెడతావేం టయ్యోవ్?" మళ్ళీ వెనక్కి వొచ్చింది సిస్టర్.

"ఏదో లేమ్మా! ప్రాణం మీది తీపి అలా అరిపించింది, అరిచాను".

"పర్వాలేదు, అతన్ని అరవనీ సిస్టర్... మన క్లినిక్ ఇన్నాళ్ళకి, బాధతో పేషెంటు అరిచే భాగ్యానికి నోచుకుంది. ఇన్ని రోజులూ... పిల్లలు లేని ఇల్లులూ, కాయల్లేని చెట్టులా, పూవుల్లేని తోటలా, నీళ్ళులేనీ నుయ్యిలా...వెల వెలా పోతోంది... సందడి లేక, నిశ్శబ్దంగా, ఉసూరు మంటూ ఉండేది. ఇవాళ... ఇతని అరుపులతో... మనక్లినిక్కి ఓ కొత్త అందం వొచ్చింది, దాంతో ఈ వీధికే మాటల్లో వర్ణించలేని సోయగం వొస్తుంది.. వొచ్చే ఉంటుంది ఈ పాటికి.. ఆ అందం ఆ సోయగం ఆడదాని వొంపుల్లా హొయలు పోతుంది..."

అరమోడ్పు కనులతో, భావా వేశంతో, తన్మయత్వంతో కథల్లో వర్ణించినట్టు చెప్పుకుపోతున్నాడు డాక్టర్.

ఆడదాని వొంపులు అన్న మాట ఒక్కటే చెవికి బాగా సోకింది సిస్టర్‌కి. వయ్యారంగా నిలబడే ప్రయత్నం చూసుకుంది. కనుచూపు మేరలో తన నడుం ఎక్కడా కనపడలేదు. మెడనెప్పెట్టి ఆ ప్రయత్నం విరమించుకుంది.

"సిస్టర్... కథలు రాయాలనే నా తపన.. ఈ తపన ఉంది చూశావూ రాత్రిళ్ళు నన్ను సరిగ్గా నిద్రపోనివ్వట్లేదు..."

"పోన్లెండి... పగలిక్కడ నిద్రపోయేది చాల్లెండి డాక్టర్" చిన్నగా గొణిగింది సిస్టర్.

"ఇతని పాదమ్మీద పుట్టు మచ్చ ఉంది చూశావా సిస్టర్" అయోమయం కాలివైపు చూస్తూ అన్నాడు.

"ఆ...ఆ.. చూశాను."

"కిందటినెల్లో నేను రాసిన "పుట్టు మచ్చ" కథలో హీరోకి సరిగ్గా అక్కడే కదా పుట్టు మచ్చ పెట్టాన్నేను".

"అబ్బే... మీరు పెట్టింది పాదమ్మీద కాదు... అరికాల్లో" రెండు రోజుల కిందట, ఆ కథ తిరిగొస్తే, నేనేగా పోస్టుమాన్ దగ్గర్నించి తీసుకుని, చదివి ఈ పక్కన సొరుగులో పడేశాను. నాకు బాగా గుర్తు...."

"అయితే అరికాల్లో అన్నమాట... పాదమ్మీద అనుకున్నాను. పోన్లే కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ అన్నారుగా...."

"అలా అంటే గుర్తొచ్చింది... దేవదాసు సినిమా మళ్ళీ వొచ్చిందిట మనూరు. ఇవాళ ఓ గంట ముందుగా ఇంటి కెళ్ళి పోతాను డాక్టర్.... ఆ సినిమాకి వెళ్తాను."

"అటు పేషెంట్లూ లేక, ఇటు నువ్వూ లేక బిక్కు బిక్కు మంటూ ఈ గదిలో పిచ్చెక్కి పోతుందేమో నాకు?"

"పొండి డాక్టర్ మీరు మరీనూ... కథలు రాసే వాళ్ళకెక్కడైనా పిచ్చెక్కుతుందేవిటీ... వాళ్ళే ఇంకోళ్ళకి పిచ్చెక్కిస్తారుగానీ... వాళ్ళ కథలతో..."

"నర్సమ్మా... నా కాలు మండిపోతోంది" అయోమయం అరుపులు.

"గాజు ముక్క కాలిగ్గుచ్చుకుంటే కాలు మండక, కడుపు మండుతుందా?..." నిర్వికారంగా జవాబిచ్చింది.

"కడుపూ మండుతోంది నర్సమ్మా... తల్చుకుంటే కడుపూ మండిపోతోంది. నేను ప్రేమించిన మా మావ కూతుర్ని మరోడికిచ్చి పెళ్ళి చెయ్యబోతున్నారు..."

"వెరీ ఇంటరెస్టింగ్ టాపిక్... చెప్పు చెప్పు...నా ముందు కథకి పనికొస్తుంది.." కుతూహలంగా, కుర్చీలో ముందుకి వంగాడు డాక్టర్.

"ముందు కథో వెనక్కదో నాకు తెలియదుగానీ బాబూ, నా జీవితమే ఓ పెద్ద కథ."

"వంద్రపుల్... వీ కథకి అదే టైటిల్ పెడతాను..." "నా జీవితమే ఓ పెద్ద కథ" అని... అసలు కథేమిటో చెప్పు... చాలా దయనీయమైన కథలా ఉంది నీ జీవితం.."

"ఔను బాబూ తమలాంటోరికి, వింటే గుండె కరిగి నీరవుతుంది."

"అబ్బా... పైకి ఉత్త అయోమయంలా, పిరికివాడిలా కనపడుతున్నావు గానీ, నీలోనూ, ఓ గొప్ప కవి దాగున్నాడోయ్..."

"అయ్యబాబోయ్! వాడెవడండీ...గాలో, ధూళో దూరిందంటారా నాలో?... భూత వైద్యుడి దగ్గరి కెళ్ళడం మంచిదంటారా?"

"అబ్బబ్బ!... అర్థం చేసుకోలేని ఈ అయోమయంతో ఏం మాట్లాడతారు గానీ... నాలాంటి నర్సుని హీరోయిన్‌గా. పెట్టిరాసే నవలకి పేరేం పెడతారు డాక్టర్?"

"వేరే పేరెందుకూ? 'సిస్టర్ విశాలం' అని పెట్టేస్తాను".

ఒక్క ఉదుటున బల్లమీంచి దూకి కాలినెప్పి సంగతి కూడా మర్చిపోయి, డాక్టర్ దగ్గిరకి వచ్చాడు అయోమయం.

"కంగారు పడకు... కంగారు పడకు... చదవడానికి అంత ఆతృత పడిపోకు ఇంకా ఆ నవల రాయడమే మొదలు పెట్టలేదు నేను" అయోమయం చేతిని పట్టుకున్నాడు డాక్టర్.

"చూశావా సిస్టర్... నా రచనలకోసం ఎలా కొట్టుకుపోతున్నారో జనాలు".

"ఔనౌను మనమిక్కడ తీరుబడి లేకుండా, పేషంట్లతో కొట్టుకుపోతున్నంత సత్యం ఆ మాట" లోపల్లోపల గొణుక్కుంది.

"నాకసలు చదువురాదు... నాకు మీ కథలొద్దుగానీ బాబూ, నేను చెప్పేది కాస్త వినండి."

"ఏవిటీ నీకు చదువురాదా? ఎంత ఘోరం... ఎంత ఘోరం... ఇప్పుడైనా నేర్చుకోవచ్చు తప్పేమీలేదు. వయోజన విద్యమీద ఓ కథ రాశాను నేను... చదవ లేదా నువ్వా కథ?"

"అయ్యో రామ. అతనికి చదువురాదని ఓ పక్క చెప్తూనే ఉంటే కథ చదవలేదా అంటారేమిటి డాక్టర్?" నెత్తి బాదుకుంది సిస్టర్.

"ఓ... అయామ్ సారీ..."

"డాక్టర్ బాబూ నేను చెప్పేది వింటారా కొంచెం..."

"కొంచెమేమిటి పూర్తిగానే వింటాను... కానీ, రేపీపాటికి నువ్వు అమ్మ ఆవు, ఇటుక, ఈగ రాసిచూపిస్తానంటేనే?"

"ఎవరమ్మ, ఎవరావు, ఎవరిటికి, ఏ ఈగా? నాకేం అర్థం కావట్లేదు డాక్టర్ బాబూ..." తలగోక్కున్నాడు.

"ఇదేదో కొత్త కవితలా ఉందే... చాలా బాగా చెప్పావు. విన్నావా సిస్టర్... అతనికి తెలియకుండానే అతను కవితలు చెప్పేస్తున్నాడు..." డాక్టర్ కళ్ళల్లో మెరుపు

"అయ్యో డాక్టర్ బాబూ.. నేను మీ దగ్గరికెందు కొచ్చానో అసలా సంగతి ముందు నన్ను చెప్పనివ్వండి"

"పేషెంటు డాక్టర్ దగ్గరి కెందుకొస్తాడో నువ్వు నాకు చెప్పాలా?

నాకా మాత్రం తెలియదా? అన్ని పరీక్షలూ నీకు చేసి గానీ ఇక్కడి నించి నిన్ను బయటికి పంపనులే... ఇలా ఈస్టూల్ మీద కూర్చో. చెప్పు నీకేం రోగం?"

"నాకేరోగం లేదు డాక్టర్ బాబూ నిజం ఒట్టు" ఏడుపు గొంతుతో అన్నాడు, బిక్కమొహంవేసి.

"ఇదేం మాయరోగం? డాక్టర్ దగ్గరకొచ్చి రోగం దాచుకుంటాడు?" బుగ్గలు నొక్కుకుంది. కళ్ళు విశాలంచేసి సిస్టర్ విశాలం.

"ఇటు వంటి వాళ్ళ రోగం ఎలా కుదర్చాలో నాకు తెలుసు. నువ్వు కంగారు పడకు సిస్టర్..."

"అయ్యో డాక్టర్ బాబూ నాకే రోగంలేదు... నేనొచ్చింది నా కోసం కాదు...ఓ కబురు చెప్పి రమ్మని ఆ అయ్యగారు పంపిస్తే వొచ్చాను."

"ఏ అయ్యగారు?"

"మీ పెత్తల్లిగారి అల్లుడు, ముందు చూపు లోకజ్ఞానం గారు"

"ముందుచూపు లోకజ్ఞానం గారా? భలే తమాషాగా ఉందే పేరు... ఆయనే వన్నా కాలజ్ఞానం బోధిస్తారా డాక్టర్." ఆశ్చర్యపోతూ అడిగింది సిస్టర్.

"కాలజ్ఞానవా కాకరకాయా. కట్టుకున్న పెళ్ళాన్ని సరిగ్గా ఏలుకునే పాటి జ్ఞానం కూడా లేదు వాడికి... ముందు చూపు వాళ్ళింటి పేరు, ఆయనగారి పేరు లోకజ్ఞానం. అంతే, అసలు వాడి మీదో కథ రాయాలని నాకెప్పటి నించో ఉంది.

"పెత్తల్లి కూతురి మొగుడైపోయాడని చూస్తున్నానుగానీ..."

"డాక్టర్ బాబూ... నేను చెప్పేది కొంచెం వినిపించుకోండి డాక్టర్ బాబూ"

"ఏమిటి? చెప్పు..."

"విశాలాక్షమ్మగారు..."

"అదే బాబూ... మీ పెత్తల్లి కూతురు గారు... కళ్ళు తిరిగి పడిపోయారు... మిమ్మల్ని వెంటనే ఓ మంచి డాక్టర్ని వెంట పెట్టుకుని అర్జంటుగా తీసుకురమ్మని మీతో చెప్పమని నన్ను పంపించారు. మీ పెత్తల్లి అల్లుడు గారు"

"ఆ..." ఒక్క ఉదుటున లేచాడు డాక్టర్ తన్మయరావు కథల తన్మయత్వాన్ని కాసేపు పక్కకి పెట్టి.

"అర్జంటుగా తీసుకురమ్మని పంపితే, మరి ఆ మాట నువ్వొచ్చిన ఇంత సేపటికి చెప్తున్నావేమిటి నాతో?"

"మీరు గానీ, ఆ నర్సమ్మగానీ ఆ మాట చెప్పేసందు నాకిస్తే కదా మొదట్లో కాసేపటికి అసలు నేనెందుకొచ్చానో మర్చేపోయాను మీ కథల రంధిలో... ఇదిగో ఇప్పుడు... మీరు... విశాలం అనగానే విశాలక్ష్మమ్మగారు గుర్తొచ్చి, అసలు నేనెందుకిక్కడికొచ్చానో అది గుర్తొచ్చింది"

"మంచివాడివేలే... పద పద... వెళ్దాం... సిస్టర్ నేవొచ్చే వరకూ, వెళ్ళిపోకు"

"డాక్టర్.... మరి నా దేవదాసు..."

"నీ దేవదాసు మరోనాల్రోజులపాటు ఊళ్ళోనే ఉంటాడు. మరేం పర్వాలేదు. రేపు కల్సుకుందువుగాని"

'జగమే మాయ బ్రతుకే మాయ' అనుకుంటూ బెంచీమీద కూలబడింది సిస్టర్ విశాలం.

★★ ★★ ★★